# ఆదర్శం

**ఆదర్శభావాలు కలిగి ఉండటం వాంఛితమే. ఎదుటివారిలో మార్పు తీసుకొని రావాలని, పరిస్థితులను సువ్య వస్థీకృతంగా మార్చాలన్న సంకల్పం సరైందే. అయితే కేవలం మాటలు, సల హాలు వల్లించనంత మాత్రానే సరిపోదు. ఆ మార్పుకై ప్రయత్నించడం వివేకం అనిపించుకుంటుంది.**


ఒక్కోసారి మంచి చేస్తున్నామనుకుంటూ ఓ మాటగా ఆదర్శం వల్లిస్తే అది వికటించవచ్చు. ప్రతికూల పవనాలనే ప్రసరించవచ్చు.

అంతేకాదు, ఈ నేపథ్యంలో గుర్తెరగవలసింది మన పరిస్థితులు. మన వాతావరణం ప్రశాం తంగా, చల్లగా, ఒడిదుడుకులు లేకుండా సాగి పోతున్నంత మాత్రాన ఎదుటివారి స్థితిగతులు అలానే ఉంటాయన్న భావన తప్పు. ఎవరి పరిస్థితులేమిటో లోతుగా అధ్యయనం చేసిన మీదటే ఓ సలహాకానీ, ఓ ఆదర్శాన్ని కానీ ప్రక టించవచ్చు, చెప్పవచ్చు.

ఆనందరావ్‌కు ఎదురైన ఓ సంఘటనే చూడండి అతని మనసును ఎంత కకావికలం చేసిందో.

ప్రతీరోజూ సాయంత్రం ఆఫీసులో ఎంత అలిసిపోయినా ఇంటికొచ్చేవేళ చిరునవ్వుతో వచ్చే ఆనందం ఆ రోజు సాయంత్రం విషణ్ణవదనంతో వచ్చేసరికి వాణికి కలవరపాటు కలిగింది.

మౌనంగా సోఫాలో అలానే కూర్చుండి పోయాడు. గలగలమని మాట్లాడించే మనిషి అలా ఉండేసరికి ఏమిటో విషయం? అని అడుగు దామనుకున్న వాణి కూడా మౌనంగా ఉండిపోయింది.



కాసేపయ్యాక 'ఇదిగో టీ' అంటూ టీ కప్పుతో వచ్చి ఆనందం ప్రక్కనే కూర్చుంది.

'వద్దు' అన్నాడు ముక్తసరిగా.

'పోనీ కాఫీ కలుపుకు తేనా?'

'ఏమొద్దు..' అసహనంగా లేచాడు.

మరి ఇంకేం మాట్లాడకుండా వాణి వంట గదిలోకి వెళ్ళిపోయింది. ఏం జరిగిందో అడిగి తెలుసుకునే ప్రయత్నం చెయ్య లేదు. కాస్తంత స్థిమితపడ్డాక ఏదైనా ఉంటే తనే చెప్తాడనుకొని సమాధాన పరుచుకుంది.

సాయంత్రం ఆరున్నర. ఇంటి ముందు స్కూల్ వ్యాన్ ఆగింది. ఏడో తరగతి కాన్వెం ట్‌లో చదువుతున్న వివేక్ పుస్తకాల సం చితో పరుగెత్తుకుంటూ లోపలికొచ్చాడు.

'డాడీ' అంటూ దగ్గరకు వచ్చాడు. కొడుకు ముఖంలోకి చూశాడు. సరిగ్గా వాడిదీ ఇదే వయసు. బనీను, ఓ నిక్కర్‌లో కనిపించే వాడు. సార్.. సార్.. అంటూ వచ్చేవాడు.

**దానం శివప్రసాదరావు**

ఆర్డరిస్తే సుడిగాలిలా పరుగెత్తుకొని వచ్చేవాడు. ఇచ్చినంత తీసుకునేవాడు. ఇవ్వకపోతే ఏమీ అడిగేవాడు కాదు.

గ్లాసులు, తిని వదిలేసిన ప్లేట్లు గట్రా శుభ్రం చేసేవాడు. టేబుల్ తుడిచి శుభ్రం చేసేవాడు. దూరంగా వెళ్ళి మెట్లదగ్గర కూర్చునేవాడు. 'సార్ సిగరెట్ ప్యాకెట్ తెమ్మంటారా? బైట వేడివేడి పకోడీ, మిర్చి ఉంటాయ్ తెమ్మంటారా?' అంతలో వెయిటర్ వచ్చేవాడు. గ్లాసులు తీయమని కసురుకునేవాడు. తలొంచుకుని చెప్పిన పని చేసేవాడు.

'ఒరే ఇలా రా! ఇందు! ఓ సిగరెట్ ప్యాకెట్ పట్రా పో' అంటే మరు సెకనులో తెచ్చేవాడు. చిల్లరతో సహా టేబుల్ మీద పెట్టేవాడు.

అంతా అయిపోయి తాము మెట్లు దిగేటప్పుడు బుద్ధిగా లేచి నుంచునేవాడు. 'ఈ చిల్లర తీస్కోరా' అంటే అటూ ఇటూ భయంగా చూస్తూ జేబులో వేసుకొని టేబుల్ శుభ్రం చేసేందుకు బకెట్ తీసుకొని వెళ్ళేవాడు.

ఆ చిల్లర జేబులో పడేసరికి వాడి ముఖంలో నెంతో తృప్తి. అనుకున్నది సాధించాను అన్న నిండైన గర్వం ఆ పసి ముఖంలో తాండవించేది.

అదిగో ఆ ముఖమే వివేక్‌లో కనిపిస్తోంది. వివేక్ కాన్రావడంలేదు. డాడీ డాడీ అంటున్న పిలుపులు వినరావడం లేదు.

యాంత్రికంగా స్నానం చేశాడు. లుంగీ బనీన్‌తో ఇంటి ముందు లాన్‌లోకి వచ్చాడు. ఈజీ చైర్‌లో రిలాక్సయ్యాడు.

'డాడీ కాఫీ' అంటూ వివేక్ కాఫీ కప్పుతో వచ్చాడు. తీసుకుని మెల్లగా సిప్ చెయ్యసాగాడు.

వివేక్ ముఖంలో వాడి రూపమే కనిపిస్తోంది. మరలా అలజడి మొదలైంది గుండెల్లో. 'ఈ పాపం నేదేనా? నేనేనా అందుకు బాధ్యుణ్ణి?

ఈసారి వాడి రూపం భయంకరంగా కనిపిస్తోంది.

నడిరోడ్డుమీద రక్తం మడుగులో. ఎర్రని చిక్కని రక్తం రోడ్డుమీద అట్టగట్టినట్లుగా ఉంది. కాళ్ళు రెండూ పెడతిరిగిపోయి ఉన్నాయి. తల భాగంలోని తల కనిపించడంలేదు. వెనుకభాగం ఛిద్రమై ఉంది. ముందు వైపు ముఖం స్పష్టంగా కానొస్తుంది. ఓ భుజం వైపు పూర్తిగా కాగితం ముక్కలా రోడ్డుకు అతుక్కుపోయి ఉంది.

'ఒరే దుర్మార్గుడా! నా చావుకు నువ్వేరా కారణం. నేనెలా బ్రతికితే నీకేంరా? నువ్వేమన్నా నన్ను పెంచి పోషిస్తున్నావట్రా? నా బతుకు నన్ను బ్రతకనివ్వకుండా నీవే కదరా ఈ పుణ్యం కట్టుకుంది. ఇక మా అమ్మకు దిక్కెవ్వర్రా? దరిద్రుడా. ఈ ఉసురు, ఆ పాపం నిన్ను వదలదురా' శాపాలు పెడ్తున్నట్టుగా హృదయాంతరాళంలో పెడబొబ్బలుగా వినిపిస్తున్నాయ్.

తలపోటు ప్రారంభమైంది. కణతలు గట్టిగా నొక్కుకుంటూ కళ్ళు మూసుకున్నాడు ఆనందం.

❄ ❄ ❄

ఆనందరావ్‌ది మంచి ఉద్యోగమే. కాస్తో కూస్తో ఆస్తిపరుడే పైగా. ఒక్కడే సంతానం. అనుకూలవతి వాణి. నలుగురితోనూ స్నేహంగా ఉంటాడు. భావకుడు. కాస్తంత ఆదర్శవాదీనూ. కొత్తవారినైనా చేరవగలిగిన మనిషి. పైగా అందరికీ తన కొలీగ్స్ అందరికీ తనంటే అభిమానం.

అందరూ ఆనందం అంటూ చనువుగా పిలుస్తుంటారు. అయితే ఒక్కటే ఒక్క దురలవాటు. వారానికోసారి తప్పనిసరిగా బార్‌లో ఫ్రెండ్స్‌తో డ్రింక్ పార్టీ.

పూర్తిగా దానికేమీ బానిస కాలేదు. అయినా వారానికోమారు ఆదివారం సాయంత్రం తన కొలీగ్స్‌తో అంతో ఇంతో పుచ్చుకోవడం అలవాటుగా మారింది. 'వాణి' ఇది గమనించి గొడవ చేసేది. బ్రతిమాలుకొని, ఈ ఒక్కసారి, ఈ ఒక్క సారంటూ ప్రాధేయపడి పర్మిషన్ తీసుకునేవాడు.

ఈ అలవాటును గమనిస్తున్న వాణి ఆఖరి వార్నింగ్ ఇచ్చింది ఓ రోజు. ఈ ఒక్కసారికి మినహా మరేరోజైనా జీవితంలో గమనించడం జరిగిందా ఇక నా శవాన్నే కళ్ళ చూస్తావ్' ఘాటుగా హెచ్చరించింది.

బెంబేలెత్తిపోయాడు ఆనందం. తనూ ఒట్టేసుకున్నాడు. కఠోర నిర్ణయం తీసుకున్నాడు. ఇక ఈ ఒక్క పార్టీతో ఆ అలవాటుకు శాశ్వతంగా గుడ్‌బై.

మిత్రులందరూ యథాప్రకారం కలుసుకునే అదే బార్‌దగ్గరకు వచ్చేశారు. ఇదే చివరి పార్టీ అన్నాడు. బిల్లు తనదేనన్నాడు. నిజానికి ఎక్కువ సార్లు బిల్ పే చేసేది కూడా ఆనందరావే. ఎవరెవరికి ఏయే బ్రాండ్స్ కావాల్నో ఆర్డరు ఇచ్చాడు. ఏవేవో మాటలు, ఏవేవో విషయాలు. ఆఫీసు విషయాలు, ఇంటి విషయాలు. ఒకటేమిటి మోతాదులు మించిపోతున్నాయ్. తర్వాత వెయిటర్‌కు ఫుడ్ ఆర్డర్ చేశారు.

'సార్ సిగరెట్లు తెమ్మంటారా?' బైట వేడి వేడి మిర్చి పకోడి తెమ్మంటారా? క్లిన్‌చేసే పిల్లాడు సీసాలు, ఖాళీ గ్లాసులను తీస్తూ అన్నాడు. పన్నెండేళ్ళ పిల్లాడు. వాడి ముఖంలోకి చూశాడు ఆనందం. బనీను, నిక్కర్, చిందరవందరగా జుట్టు. సన్నగా పీలగా. వెయటర్ కావలసినవన్నీ సప్లయ్ చేస్తున్నా, చిన్న చిన్నవాటికి, ఆర్డర్లకు క్లీనింగ్ చేసే పిల్లలు అడుగుతుంటారు. చిల్లరకోసం వాళ్ళ తిప్పలు. వెయిటర్‌కు టిప్ ఎలాగూ ఉంటుంది. క్లీనింగ్ చేసే పిల్లలూ అంతో ఇంతో నాల్రూపాయల సంపాదనకు పడే ప్రయాసలు అవన్నీను.

"ఒరే ఇట్రా నీపేరేంట్రా?" అన్నాడు ఆనందం.

"రాంబాబు" సార్

"రోజుకెంతొస్తుందిరా నీకు?"

"రోజుకు ముప్పై రూపాయలిస్తారు సార్"

"పైన ఎంతొస్తుందిరా?"

"పదైదు రూపాయలొస్తాయి సార్"

"నిజం చెప్పు"

"ఒట్టుసార్"

"ఆనందం వాడితో ఏంటి? పోనీ"

"అలాకాదు సుభాష్ నువ్వుండు"

## అమ్మతనం



**అమ్మతనంలో**
**కమ్మతనం**
**తేనేలో జున్ను నంజుకున్నంత మధురం**
**పదిమందిలో ఒక్కతెగా ఎదిగా**
**ఐనా అమ్మ ప్రేమలో పల్చన లేదు**
**ప్రతి ఒక్కరినీ బుజ్జగించేది**
**లాలించేది, గిల్లికజ్జాలు తీర్చేది**
**గోరింటాకులే పెట్టేది**
**గోరుముద్దలే తినిపించేది**
**ఎవరికి వారం అమ్మ ప్రేమ**
**నాకే సొంతం అనుకునేవాళ్ళం**
**పదిమంది మీది ప్రేమా**
**ముగ్గురికి పరిమితం చేసుకున్నా**
**అమ్మకంటె మిన్నగా పెంచాలనుకున్నా**
**ప్రేమ పంచాలనుకున్నా**
**ఉద్యోగంలో అలసిన నేను**
**పిల్లల పెంపకంలో సేద తీరాను**
**అమ్మ చూడాలని ఉంది రమ్మంటే**
**నా పిల్లలకెక్కడ లోటొస్తుందోనని**
**ఏదో వంక పెట్టేదాన్ని**
**ఎప్పుడో వెళ్ళేదాన్ని**
**అమ్మ ఏడ్చేది తరచూ రాలేదని**
**నా పిల్లలు పెరిగి పెద్దయ్యారు**
**ముగ్గురి ప్రేమ ఇద్దరికే పరిమితం**
**చేసుకున్నారు**
**అమ్మకంటే**
**ప్రేమగా వాళ్ళు**
**పెంచుకుందామనుకుంటున్నారు**
**చరిత్ర పునరావృతమైంది**
**వాళ్ళను చూడాలని పరితపించాను**
**రాలేకపోవడానికి కారణాలనేకం**
**చెప్తున్నారు**
**అప్పుడనిపించింది**
**మా అమ్మా నా కోసం**
**అంతే ఎదురు చూసి ఉంటుందని**
**అమ్మను చూడాలి**
**అమ్మ ఒడిలో తలపెట్టుకుని**
**హృదయభారం తీర్చుకోవాలి**
**కానీ ఏదీ అమ్మ**
**తను పెంచిన పక్షులు**
**రెక్కలొచ్చి ఎగిరిపోయాయని**
**వారి మీద బెంగతో**
**అనంత తీరాలకు తరలిపోయింది**

— సి రత్నమాంబ

"అరేయ్ మీ నాన్న ఏం చేస్తుంటాడ్రా?"

"లేడు"

"లేదంటే?"

"మా అమ్మను వదిలేసి పొయ్యాడుసార్"

"ఈ డబ్బులేం చేస్తావ్?"

"మా అమ్మకిస్తా సార్"

"అరేయ్ బడికెందుకు పోవట్లేదురా నువ్వు?"

"బడికి పోతే దినం ఎట్టా గడుస్తాది సార్? మా అమ్మ జబ్బు మనిషి సార్"

అంతలో వెయిటర్ ఫుడ్ సర్వ్ చేశాడు. ఈ పిల్లాడు బకెట్ తీసుకొని వెళ్ళిపోయాడు. వెయిటర్‌తో మత్తులోనే అన్నాడు ఆనందరావ్.

"ఏయ్ బాలకార్మిక వ్యవస్థ మీ బార్‌లో ఉంది. పొద్దస్తమానం వాడితో చాకిరీ చేయించుకొని ముప్ఫై రూపాయలు ఇస్తారా? ఏడి? మీ మేనేజర్‌ను ఇటు పిలు" మాటలు ముద్దముద్దగా వస్తున్నాయి.

చిన్నగా నవ్వాడు వెయిటర్ "ఇట్లాంటి కూతలన్నీ మామూలే" అనుకుంటున్నట్లు. "అలాగే సార్" ఇంకేమన్నా ఆర్డర్ చెయ్యమంటారా?"

తిండి ధ్యాసలో పడిపోయారు. మిత్ర బృందం నలుగురూ ఎవరి మాటల్లో వారు పడిపోయారు. పదైంది రాత్రి ఇంటికి చేరేసరికి.

ఇంటికి చేరిన ఆనందం ఫోన్ చేశాడు. ఫలానా బార్‌లో పిల్లలచేత వెట్టిచాకిరీ చేయిస్తున్నారని సంబంధిత అధికారులకు.

ఇక ఆపై జరిగిందేమిటో ఆనందరావ్‌కు తెలీదు. బార్ యజమానిని మందలించి, ఫైన్ వేసి పిల్లలు బార్‌లో పనిచేయడాన్ని ఆపి వేయించారు అధికారులు. ప్రతిసారీ బార్‌కు వెళ్ళినప్పుడు పిల్లలను చూడటం అలవాటే. తెలిసిన విషయమే.

కానీ ఆ రోజు అదే టాపిక్ అయిపోయింది ఆనందానికి. పర్యవసానంగా అధికారులకు తెలియపరిచాడు.

వెట్టిచాకిరీ నుండి ఓ పిల్లవాణ్ణి విడుదల చేయించానని తృప్తి పడ్డాడు ఆనందం. ఫోన్ అధికారులకు చేయగానే బార్ అడ్రసు నోట్ చేసుకొని చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇక అటు తర్వాత జరిగిందేమిటో తెలీదు ఆనందానికి.

వాణికి ఇచ్చిన మాటకు కట్టుబడిపోయాడు. ఇది జరిగిన సరిగ్గా పదిరోజుల తర్వాత – సాయంత్రం తను ఆఫీసు నుండి ఇంటికొస్తున్నాడు స్కూటర్ మీద. లేబర్ కాలనీ దాటి మెయిన్‌రోడ్ కెక్కితే తన నివాసం ఐదు నిముషాల్లో చేరుకునే దూరం.

లేబర్ కాలనీ దగ్గర రోడ్డుమీద జనం. ఓ లోడ్ లారీ ఆగిపోయి ఉంది. రక్తం మడుగులో ఓ పిల్లవాడి శరీరం. వెహికిల్ రోడ్ ప్రక్కన నిలిపి, జనంలోకి వెళ్ళి చూశాడు ఆనందరావ్. యాక్సిడెంట్. పాపం చిన్న పిల్లాడు. సత్తెమ్మ కొడుకు రాంబాబుగాడు. బార్‌లో పని చేస్తుంటే తీసేశారంట. వాళ్ళమ్మతో అదుగో ఆ బిల్డింగ్ పనికి పోతాడు రోజూ. రోడ్డు దాటబోతుంటే పాపం ఏవడో తాగుబోతు ఎదవ గుద్దేశాడు.

షాక్ తిన్నాడు ఆనందరావ్. తల వెనుక భాగం చిట్లిపోయింది. ముందు ముఖం కనిపిస్తోంది వాడే వాడే ఆ పిల్లగాడే.

కడుపులో చెయ్యిపెట్టి పేగులు తోడేసేలాగున ఉంది బాధ.

"ఈ డబ్బులు ఏం చేస్తావురా?"

"మా అమ్మకిస్తా సార్" తన ఆనాటి మైకంలోని, వాడి మాటలు గుర్తుకొచ్చాయి.

"నేను పొరపాటు చేశానా? బార్‌లో వాణ్ణి తీసెయ్యబట్టే గదా ఇవాళ వాడికి ఇలా అయ్యింది" గోలపెడ్తోంది మనసు.

"చూడు అలా ఎందుకనుకోవాలి? ఇది రోడ్డు ప్రమాదం కదా! ఎప్పుడు ఎలా జరుగుతాయో చెప్పలేం కదా?" సర్దబోయింది మనసు.

"కాదు. ఈవేళప్పుడు వాడు బార్‌లో ఉండేవాడు కదా! వాణ్ణి తీసేయకుంటే?" పరోక్షంగా నేనే వాణ్ణి పొట్టన పెట్టుకున్నానా?" ఆక్రోశించింది మళ్ళీ మనసు. మేలు చేయబోతే కీడు ఎదురైందా? ఇదేమిటి?

అయినా వాణ్ణి ఆ పని నుండి తొలగించగల్గానే కానీ, తర్వాత వాడేమిటి? అన్నదానికి జవాబుగా ఏం చెయ్యగలిగాను? ఉన్న ఆధారం ఆ తల్లికి లేకుండా చేశానే? ఏమైంది నా బుద్ధి? పేదరికాన్ని పోగొట్టే పని చేయకపోగా ఉన్న ఆధారాన్ని తీసివేసే హక్కు నైతికంగా నాకు ఉందా? వాణ్ణి ఏదైనా హాస్టల్‌లో చేర్పించి చదువుకొనే ప్రయత్నం నేను ఏదైనా చేశానా? ఏం చెయ్యలేదే. ఏమిటి నా ఆదర్శ భావం? ఇదా నేను వాడికి చేసిన ఉపకారం? పరోక్షంగానైనా వాడి చావుకు కారణం ఎవరు?

తప్పతాగి నడిపే ఆ డ్రైవరా? తాగిన మత్తులో ఏదో ఉద్ధరిద్దామని ఫోన్ చేసిన ఘనుణ్ణి నేనా?

"ఏమండీ ఏమిటా పరధ్యానం? ఇందాకట్నుంచి ఏమిటి ఆలోచన్లు? ఏం జరిగింది. టైమెంతైందో చూడండి. లేవండి భోజనానికి" అన్న వాణి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు ఆనందరావ్. లోపలికి నడిచాడు. వివేక్ సోఫాలో పడుకొని నిద్రపోతున్నాడు.

వారం రోజులు గడిచిపోయినయ్. ఆ సాయంత్రం ఆఫీసు నుండి వస్తూ ఓ నలభై ఐదేళ్ళ సన్నని దేహంతో ఉన్న స్త్రీని వెంటబెట్టుకొచ్చాడు ఆనందరావ్.

"ఎవరీమె?" అంది వాణి. పాలిపోయి కూలినాలి చేసుకొని పొట్టపోసుకునే మనిషిలా ఉంది. వాణిని చూస్తూనే దండం పెట్టింది.

"మనింట్లోనే పనిమనిషిగా ఉంటుంది. చేతనైన మేరకు నీకు సాయంగా ఉంటుంది." ఆశ్చర్యపోయింది వాణి.

"ఇప్పుడెందుకు? పనిమనిషి ఉందిగా మనకు" అంది.

"అయినా సరే అక్కడే మనల్ని ఇంటిని కనిపెట్టుకొని ఉంటుంది"

'సత్తెమ్మా! మాతోనే ఉండు. నీకు చేతనైన పన్లు చెయ్యి. రేపు హాస్పిటల్‌కు తీసుకువెళతాను నిన్ను. మందులిప్పిస్తాను"


"చూడు వాణి! ముందు సత్తెమ్మకు అన్నం పెట్టు. ఆ ముందు గదిలో తను ఉంటుంది మనల్ని, ఇంటిని కనిపెట్టుకుంటూ"

ఆ రాత్రి జరిగింది మొత్తం ఆనందరావ్ వాణికి చెప్పాడు.

"తన పన్నెండేళ్ళ కొడుకును వివేక్‌లో చూసుకుంటుంది పోనీలే పాపం" అంది వాణి.

తృప్తిగా నిద్రకుపక్రమించాడు ఆనందరావ్. ❋

## కళ్ళద్దాల కథాక్రమామిషు



కళ్ళద్దాలు దాదాపు 700 ఏళ్ళ క్రితం నుంచి వాడకంలోకి వచ్చాయి. అంతక్రితం 'రీడింగ్ స్టోన్' అనే ఒక రకం అద్దాన్ని అక్షరాల మీదే పెట్టి చదువుకునేవారు. అలా చాలా ఏళ్ళు పోయాక ఇటలీకి చెందిన సాల్వినోడి ఆర్మేట్ 1284లో కళ్ళకు ధరించడానికి వీలుగా ఉండే అద్దాలను తయారుచేశాడు. అయితే కళ్ళద్దాల వాడకం ఎక్కడ మొదలయిందన్న దానిపై కొంత వివాదం ఉంది. చాలాకాలం కిందటి నుంచే చైనాలో కళ్ళద్దాలు వాడేవారని కొందరు చెబుతారు.

రోజర్ బేకన్ అనే శాస్త్రవేత్త 1262లోనే వస్తువుల ఆకారాలను పెద్దగా చూపించే అద్దాలను రూపొందించానని తన పరిశోధన పత్రాల్లో రాసుకున్నాడు. ఒకే దాంట్లో రెండు రకాల అద్దాలు (బైఫోకల్) ఉండే వాటిని 1784లో బెంజమిన్ ఫ్రాంక్లిన్ తయారు చేశాడు. ఈ రెండు అద్దాల మధ్య కూడా ఫ్రేం ఉండేది. ఆ తర్వాత వందేళ్ళకు గానీ మధ్యలో ఫ్రేం లేకుండా కలిసి ఉన్న కళ్ళద్దాలు తయారుకాలేదు.

**– ఎం.ఎ. షరీఫ్**

## మరక-చురక

